క్లుప్తంగా

అనాథ పిల్లలకు రూ. 29 వేల ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రామడుగు: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన దైవాల పావని, పర్శారాంలు మృతి చెందడంతో వారి కూతుళ్లు అక్షర, కృతిక అనాథలయ్యారు. శనివారం లయన్స్ క్లబ్ చొప్పదండి రూ. 29 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ... అక్షర, కృతికకు భవిష్యత్‌లో ఎలాంటి అవసరాలేర్పడిన అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహేషుని మల్లేశం, కార్యదర్శి దూస రాము, కోశాధికారి మామిడి రాజేశ్వర్, జిల్లా అదనపు కార్యదర్శి మోర భద్రేశం, లయన్స్ పెద్ది లక్ష్మీకాంతం, ఆనందం, లక్ష్మయ్య, రవి, జితేందర్, సత్యనారాయణ, ఆంజనేయులు, గ్రామానికి చెందిన గౌడ కుల సంఘం నాయకులు, పలువురు పాల్గొన్నారు.

కవయిత్రికి సన్మానం



వసంతను సన్మానిస్తున్న జ్యోతి

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని కేజీబీవీ తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కవయిత్రి పతెం వసంతను స్కూల్ స్పెషల్ ఆఫీసర్ కిరణ్‌జ్యోతి శనివారం సన్మానించారు. వసంత తన కవితలతో ఆకాశమే అవధిగా ప్రచురించిన సంపుటిని హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ఆవిష్కరించి సాహిత్యరంగ ప్రముఖుల ప్రశంసలు పొందినందుకు అభినందించారు. టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

సీఐని కలిసి నాయకులు



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

జమ్మికుంట: జమ్మికుంట టౌన్ సీఐగా ఇటీవల భాధ్యతలు చేపట్టిన వి. రవిని మండలంలోని గండ్రపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వీరంనేని పర్శరాం రావుతోపాటు నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తనుగుల గ్రామ శివారులో నిర్వహించే సమ్మక్క,సారలమ్మ జాతరకు రావాలని ఆహ్వానించారు. తనుగుల జాతర కమిటీ అధ్యక్షుడు రఘుపతి, ఉపాధ్యాక్షుడు వీరగోపాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన నాయకులతో ప్రణవ్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ నివాస గృహ ఆవరణలో శనివారం కమలాపూర్ మండలం మర్రివానిపల్లి గ్రామానికి చెందిన పద్మశాలీ కులస్తులు కమలాపూర్ మండలాధ్యక్షుడు చరణ్ పటేల్ అధ్యక్షతన కాంగ్రెస్‌లో చేరారు. ప్రణవ్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. చేరిన వారిలో రమేష్, అశోక్, గౌరి శంకర్, రామచంద్రం, మురళీ, పురుషోత్తం, జయశంకర్, సాంబయ్య,రాజేశం, కనుకయ్య,ప్రభాకర్ ఉన్నారు.

వీడ్కోలు వేడుకలు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

గంగాధర: మండలంలోని మధురానగ సురభి స్కూల్‌లో శనివారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ వీరేశం మాట్లాడుతూ... విద్యార్థులు పరీక్షల భయం వీడి ప్రణాళికతో చదివితే మంచి ఫలితం సాధించవచ్చని చెప్పారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. డైరెక్టర్ వీర నర్సయ్య, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులపై శ్రద్ధ చూపాలి

హుజూరాబాద్: సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులపై ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్ శనివారం ప్రకటనలో కోరారు. విద్యార్థులు పరీక్షల్లో రాణించాలంటే హాస్టల్ వార్డెన్లు స్థానికంగా ఉంటూ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించి, మానసిక, శారీరక ఒత్తిళ్లకు గురి చేయొద్దని చూడాలన్నారు.



వనం వీడి జనంలోకి..

- వన్యప్రాణుల రాకతో జనం బెంబేలు
- కనుమరుగవుతున్న గుట్టలు • బాంబుల శబ్దాలకు బయటకొస్తున్న జంతువులు

మానకొండూర్‌రూరల్: అడవుల్లో ఉండాల్సిన జంతువులు జనారణ్యంలోకి ప్రవేశిస్తున్నాయి. గుట్టలు, పొదలల్లో నీటి వసతులు లేకపోవడంతో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి పూట తాగునీటి కోసం గ్రామాల్లోని చెరువులు, కుంటల వద్దకు వస్తున్నాయి. గ్రామ పొలిమేరల్లోకి వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా దాడులకు పాల్పడుతున్నాయి. మండలంలోని బంజేరుపల్లి, గట్టిపల్లి, శ్రీనివాస్‌నగర్, రాఘవాపూర్, గుట్టల్లో క్రషర్, గ్రానైట్ పనులు రాత్రి, పగలు తేడా లేకుండా నిర్విరామంగా కొనసాగుతున్నాయి. బాంబుల శబ్దాలకు గుట్టలు, వనంలో నివసించే కోతులు, కొండెంగ, కొండచిలువలు, ఎలుగుబంట్లు ఉదయం, పగలు, రాత్రి అనే తేడాలేకుండా గ్రామాల్లోకి చొరబడుతున్నాయి. జనవాసాల్లోకి వన్యప్రాణులు ప్రవేశించడంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు.



- ఇటీవల మానకొండూర్ మండల కేంద్రంలోని చెరువుకట్ట వద్దకు ఎలుగు బంటి వచ్చింది. కుక్కల అరుపులు విని ఇంట్లోకి దూరబోయి పక్కనే ఉన్న చెట్టు ఎక్కింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు హల్‌చల్ చేసింది. ఫారెస్ట్, పోలీస్ అధికారులు దాన్ని పట్టుకోవడానికి ఎంతో శ్రమించారు. వరంగల్ నుంచి పశువైద్యుడిని పిలిపించి మత్తు ఇంజిక్షన్ గన్‌ద్వారా పంపించి ఎలుగు బంటిని బంధించి వరంగల్‌కు తరలించారు. గతంలో కూడా మండలంలోని ఈదులగట్టెపల్లి గుట్టల నుంచి ఓ ఎలుగుబంటి గ్రామంలోనికి ప్రవేశించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఒకరిపై దాడిచేసి గాయపర్చడమే కాకుండా మరోవ్యక్తి ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేసింది. జంతువులు జనావాసాల్లో వస్తుండటంతో పొలాల వద్దకు వెళ్లే రైతులు బిక్కుబిక్కుమంటూ ప్రాణ భీతితో పనులు చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు, నాయకులు చొరవతీసుకొని అటవి జంతువులు జనవాసాల్లోకి రాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు చర్యలు చేపట్టాలి



జనావాసంలోనికి జంతువులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఏ జంతువు ఎప్పుడు ఊరుమీదికి వస్తుందేమోనని భయాందోళనలో ఉంటున్నారు. రక్షణ చర్యలపై అటవీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి.

– అవరాజు శ్రీనివాస్, మాజీ వార్డుమెంబర్

గుట్టలను తవ్వొద్దు



గ్రానైట్, క్రషర్ పనుల కోసం గుట్టల్లో చేపడుతున్న బాంబు శబ్దాలను నిలిపి వేయాలి. భారీ శబ్దాలకు భయపడి జంతువులు గ్రామాల్లోనికి వచ్చి ప్రజలపై దాడిచేస్తున్నాయి. గుట్టలను తవ్వకుండా చేస్తేనే జంతువులు గ్రామాల్లోకి రావు.

ఎండీ షేక్ సోహెల్, మానకొండూర్

సైన్స్ టాలెంట్ టెస్ట్



బహుమతులు అందజేస్తున్న జగదీశ్వర్

హుజూరాబాద్: పట్టణ శివారులోని బోర్నపల్లి మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించినట్లు ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎం. సంపత్‌తో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: మండలంలోని బీసీ గురుకుల పాఠశాలలో ట్రస్టు ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. విజేతలకు ట్రస్టు నిర్వాహకుడు జగదీశ్వర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ సంపత్, అధ్యాపక బృందం ఉన్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి పెట్టాలి



స్వరూపరాణిని సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు పరిశోధనలపై దృష్టి పెట్టాలని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర ప్రొఫెసర్ స్వరూపరాణి అన్నారు. శనివారం మండలంలోని సింగాపూర్ గ్రామం వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో బాటనీ, జువాలజీ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. బాటనీ, జువాలజీలకు ప్రస్తుతం ఫుల్ డిమాండ్ ఉందని, పెద్ద సంఖ్యలో పరిశోధనలు జరుగుతుంతున్నాయని, విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించుకోవాలన్నారు. మహిళ విద్యార్థులు స్వయం సాధికారత సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. విద్యావంతులతో దేశం అభివృద్ధి చెందుతుందని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం అధ్యాపకురాలిని కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమాకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులున్నారు.

చిన్నారుల ఔదార్యం



ప్రశాంత్ భవన్‌లో మదర్ థెరిస్సా స్కూల్ విద్యార్థులు

చొప్పదండి/రామడుగు: చొప్పదండి మండల పరిధిలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన సెయింట్ మదర్ థెరిస్సా స్కూల్ విద్యార్థులు ఔదార్యం చాటుకున్నారు. రామడుగు మండలం వెలిచాల గ్రామ పరిధిలోని ప్రశాంత్ భవన్ విద్యార్థుల కోసం పాకెట్ మనీతో నిత్యావసర సరుకులను కొనుగోలు చేసి శనివారం అందజేశారు. విద్యార్థులను పరిచయం చేసుకొని ఆటపాటలతో కాలక్షేపం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నాగోదు వినోద్‌కుమార్, ట్రస్మా నాయకులు ఉప్పుల శ్రీనివాస్, ఫాదర్ డైజో, కూర్మాచలం రత్నాక,విజయశ్రీ, మార్త, లిల్లీ సిరియాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న నరేశ్‌పటేల్, జీవన్, సిద్దు

జమ్మికుంట: యువత సంక్షేమానికి కేటాయించిన బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీవైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు నరేశ్ పటేల్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జాబ్ కాలెండర్, నిరుద్యోగ భృతి, 2లక్షల ఉద్యోగాలపై నామామాత్రమే ప్రస్తావన చేశారని, అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించాల, విద్యారంగానికి ఆశించిన మేరకు బడ్జెట్ కేటాయించలేదని, పాఠశాల, ఉన్నత విద్య, యూనివర్సిటీలు, సంక్షోభంలో ఉన్నాయని ప్రభుత్వం బడ్జెట్ పెంచాలన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ, అభివృద్ధికి ప్రత్యేక యూనివర్సిటీ నిర్మిస్తామన్న హామీలు నెరవేర్చాలన్నారు. భవిష్యత్‌లో విద్యార్థి, యువజన సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం డీవైఎఫ్ఐ జమ్మికుంట మండల కన్వీనర్‌గా ఎలుక సాయి, కో కన్వీనర్‌గా ముద్దమల్ల చరణ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పర్లపల్లి జీవన్, సిద్దు, స్వాగత్, బాలు, సురేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

• ఆస్తి కోసం తండ్రిని కిడ్నాప్ చేసిన కొడుకు

జమ్మికుంట: ఆస్తి కోసం కొడుకు కిడ్నాప్ చేశాడని ఓ తండ్రి కోర్టును ఆశ్రయించగా కొడుకు, మరో నలుగురిపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ రాధాకిషన్ శనివారం తెలిపారు. పట్టణంలోని పాతమార్కెట్ సమీపంలో నివాసముండే ముత్తవేన వెంకటయ్యను గతేడాది డిసెంబర్ 15న కొడుకు రవీందర్, మరో నలుగురు కలిసి ఆస్తి పంపకాలు చేయాలని కిడ్నాప్ చేశారు. వెంకటయ్య కోర్టును ఆశ్రయించగా కోర్టు ఉత్తర్వుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

• హైనా దాడిలో లేగ దూడ మృతి? ...

తిమ్మాపూర్: చిగురుమామిడి మండలం నవాబుపేటలో మర్రి శ్రీనివాస్ అనే రైతుకు చెందిన లేగదూడపై హైనా దాడి చేసింది. రైతు శ్రీనివాస్ తెలిపిన వివరాలు..ప్రతీరోజులాగే శ్రీనివాస్ శనివారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా లేగ దూడ చనిపోయి ఉంది. హైనా దాడి చేసి చంపినట్లు అనుమానం వ్యక్తం చేశాడు. ఈమేరకు గ్రామస్తులు అధికారులకు సమాచారం అందించారు. రూ.25వేల విలువ చేసే లేగదూడ మృతి చెందడంతో శ్రీనివాస్ కంటతడి పెట్టాడు. ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

• ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వి.రవి తెలిపారు. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మానేరు పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ట్రాక్టర్ ద్వారా ఇసుక రవాణా చేస్తుండగా మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి వద్ద పట్టుకున్నామని వివరించారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం



వొడితెల ప్రణవ్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామం శ్రీమహగణపతి, పార్వతిదేవి సమేత మహాలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీశివాలయ ధ్వజస్తంభ మహోత్సవం అంగరంగా వైభవంగా కొనసాగుతోంది. కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు ప్రణవ్‌ను ఆశీర్వదించారు. అదేవిధంగా చల్లూరు (ఇప్పలపల్లి)గ్రామంలో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర స్థలాన్ని ప్రణవ్ సందర్శించారు. అనంతరం జాతర పోస్టర్ ఆవిష్కరించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పంజాల సతీశ్ గౌడ్, ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, కుమార్ ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు



పరీక్ష ప్యాడ్‌లు అందిస్తున్న విష్ణు, రజిత, నిరంజన్

జమ్మికుంట: పట్టణంలోని కేజీబీవీలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణతో పాటు చదువులో మంచి మార్కులు సాధించి జీవితంతో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రజిత, నిరంజన్, సునీల్, తదితరులున్నారు.

సేవాలాల్ జయంతి



రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట ప్రధాన చౌరస్తా వద్ద శనివారం సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతిని ధర్మజాగరణ సమితి నాయకులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్మరంలో ధర్మజాగరణ జిల్లా కమిటీ సభ్యులు మహిపాల్‌రెడ్డి, మండల సమన్వయ కర్త రాములుగౌడ్, సాయిలుగౌడ్, తిరపతినాయక్, రూప్‌నాయక్, నగవత్ నాయక్, రాజేశంనాయక్, రాంచెందర్‌నాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

సాక్షి నెట్‌వర్క్: శాసనసభలో సమగ్ర కులగణనకు ఏకగ్రీవ ఆమోదం లభించడంతో చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో శనివారం కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తు కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. పూలే చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్పా, అభ్యున్నతికీ ఎవరూ కృషి చేయలేదని, చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ కులగణనకు మంత్రి వర్గ తీర్మానం చేయించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ కులగణన చేపడుతామని హామీ ఇచ్చారని తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేయడం అభినందనీయమన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ బండారి రమేశ్, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో కిరణ్



పనులు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ రమేశ్, ఎంపీటీసీ శోభ, బసవయ్య, తిరుపతి, మోయిన్

తిమ్మాపూర్: మండలంలోని పొలంపల్లి గ్రామంలో పోచమ్మ టెంపుల్‌కు కరెంటు, వీధి దీపాలతోపాటు గౌడ సంఘం కమిటీ హాల్ పనులను ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో కిరణ్, ఎంపీటీసీ బండారి రమేశ్ శనివారం ప్రారంభించారు. గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని, ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని, గ్రామస్తులు సహకరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు, ఎంపీటీసీ బండారి రమేశ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్, సొసైటీ మాజీ చైర్మన్ బుడిగె కొండయ్య, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మల్లేశం కసుకం కొమురయ్య, సీపీఐ మండల కార్యదర్శి తిరుపతి, మొండయ్య, సంపత్, రెడ్డి రవి, సారయ్య, శ్రీనివాస్, మోహన్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. జీపీ అధి కారులు, ప్రత్యేక అధికారులు భూమిపూజ చేశారు. ఉపాధిహామి పథకం కింద మానకొండూర్ ఎమ్మె ల్యే కవ్వంపల్లిసత్యనారాయణ రూ.1.20 కోట్లు మంజూరు చేశారని మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అనంతరం మాట్లాడుతూ సీసీరోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ రమేశ్, నాయకులు బసవయ్య, తిరుపతి, ఎంపీటీసీ శోభ, మోయిన్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

జమ్మికుంట: ప్రజలపై సముచిత భావం కలిగి ఉండాలని హుజూరాబాద్ ఏసీపీ సీహెచ్. శ్రీనివాస్‌జీ అన్నారు. శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలన, కేసుల పురోగతి విషయాలను తెలుసుకున్నారు. ఫిర్యాదులను విచారించి కేసులు నమోదు చేయాలని సూచించారు. సీఐ వి.రవి, సిబ్బంది ఉన్నారు.

కేసీఆర్ జన్మదిన వేడుకలు



బిస్కెట్ ప్యాకెట్లు, పండ్లు అందజేస్తున్న రామడుగు సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్వర్‌రావు



గన్నేరువరంలో గంప వెంకన్న, నాయకులు

చొప్పదండి: పట్టణంలోని మార్కెట్ చౌరస్తాలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఎంపీపీ చిలుక రవీందర్, జడ్పీటీసీ మాచర్ల సౌజన్య, మినుపాల తిరుపతిరావు, వెల్మ శ్రీనివాస్ రెడ్డి, లోక రాజేశ్వర్‌రెడ్డి, గడ్డం చుక్కరెడ్డి, ఇప్పనపల్లి సాంబయ్య,పాల్గొన్నారు. గుమ్లాపూర్‌లో రాజశేఖర్, కొలిమికుంటలో మల్లేశం కేక్ కట్ చేశారు.

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌక్ సమీపంలో కేసీఆర్ జన్మదిన వేడుకలన ఘనంగా జరిపారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, వార్డు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సైదాపూర్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజయ్య, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు తిరుపతిరెడ్డి, వెంకట్ రెడ్డి కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.

గన్నేరువరం: గన్నేరువరంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మహిళ విభాగం అధ్యక్షురాలు కుసుంభ నవీన, గ్రామఅధ్యక్షుడు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు టంగుటూరు రాజకుమార్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ స్వప్న కోటి, కౌన్సిలర్లు భాస్కర్, శ్రీనివాస్, శ్రీపతి నరేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని వెలిచాల పరిధిలో నిప్రశాంత్ భవన్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గంట్ల జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులకు నిత్యావసర సరుకులు, వస్తువులు అందజేశారు. రామడుగు సింగిల్ విండో చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ కిష్టారెడ్డి, కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, రైతు బంధు జిల్లా కమిటీసభ్యులు సంజీవరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, లచ్చయ్య, ఎంపీటీసీ మహేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మొక్కలు నాటారు. గంగాధర చౌరస్తాలో బీఆర్ఎస్‌మండల శాఖ అధ్యక్షులు నవీన్‌రావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

ముమ్మరంగా ఏర్పాట్లు



ఇల్లందకుంట మండలం మల్యాల గ్రామంలోని సమ్మక్క సారలమ్మ గద్దెలు

రామడుగు: మండలంలోని రామడుగు, షానగర్, తిర్మలాపూర్, గుండి, గోపాల్‌రావుపేట గ్రామ పరిధిలో సమ్మక్క-సారలమ్మ జాతర ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు భారీగా వచ్చి వనదేవతలకు మొక్కలు చెల్లించుకోవాలని కోరారు.

ఇల్లందకుంట: మండలంలోని మల్యాల గ్రామంలో గల సమ్మక్క -సారమ్మ జాతర వైభవంగా నిర్వహించేందుకు జాతర కమిటీ చైర్మన్ గురుకుంట్ల రాజీరు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

హుజూరాబాద్: సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులు, జాతర కమిటీ నిర్వాహకులకు కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ సూచించారు. పట్టణంలోని రంగనాయకుల గుట్ట సమీపంలోని సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించారు. మంచి నీటి వసతి, విద్యుత్ దీపాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లకు ఇరువైపులాచెట్లను తొలగించాలని తెలిపారు. జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ రా జిరెడ్డి, వైస్ చైర్మన్ గాలిబు నరేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

రామడుగు: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన కొండం భూంరెడ్డి(60) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. భూంరెడ్డి శనివారం మద్యం సేవించి, ఇంటికి వచ్చాడు. భార్య విమలతో గొడవపడి, ఇంటి నుంచి బయటకు వచ్చి క్రిమిసంహారక మందు తాగి, రోడ్డుపై పడిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి ఒక కూతురు, కుమారుడు కాగా, పెళ్లిళ్లయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్ గ్రామానికి చెందిన కొర్వి రాంచందర్ ఇటీవల మృతి చెందారు. ఈసందర్భంగా ఆయన కుటుంబసభ్యులను యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి శనివారం పరామర్శించారు. అనంతరం యాభై కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ రవికుమార్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మల్లయ్య, శ్రీనివాస్, హరీశ్, బాబు తదితరులు పాల్గొన్నారు.